sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 03-08-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 118 EDITOR: ROHINI



20 పట్టింది... 80 నష్టింది

20 శాతం జనాభాలోనే చెత్తగాళ్లు

- దొంగతనాలు, రేప్, దోపిడీలు చేసేది వీళ్లే
- అన్ని రకాల దురలవాట్లు ఉండేది వీరిలోనే
- ప్రపంచంలో ప్రభుత్వ నిధులు మింగేసేది వీళ్లే
- ఆ 20 శాతం మంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు
- 84 శాతం సిగరెట్లు తాగేది 20 శాతం మందే
- అక్రమ సంబంధాలపై ఆసక్తి చూపించేదీ వీరే
- మిగిలిన 80 శాతం మంది ప్రజలు మంచివాళ్లే
- ఒక అంతర్జాతీయ సర్వే షాకింగ్ నివేదిక

సమాజాన్ని వణికిస్తున్న నేర ప్రపంచం వెనుక ఉన్న అసలు రహస్యం బయటపడింది. హత్యలు, దొంగతనాలు, మోసాలు అన్నీ చేస్తున్నది కేవలం 20 శాతం మంది మాత్రమేనని పోలీసు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ నమ్మశక్యం కాని గణాంకాలే నేటి సమాజంలో శాంతి భద్రతలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

- సహనం వందే, హైదరాబాద్

జనాభాలో కేవలం 20 శాతం మంది మాత్రమే నేరాలన్నింటికీ బాధ్యులుగా ఉంటున్నారని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. హత్యలు, దొంగతనాలు, మోసాలు వంటి అన్ని రకాల క్రిమినల్ కన్విక్షన్స్ అన్నీ కూడా వీరి చుట్టూనే తిరుగుతుంటాయి. సమాజంలో శాంతి భద్రతలను కాపాడటానికి పోలీసు శాఖ పడే కష్టమంతా కేవలం ఈ అతి తక్కువ శాతం మంది నేరస్థుల గురించే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీళ్ళు లేకపోతే అసలు కోర్టులు, జైళ్లు, పోలీసు స్టేషన్లు అనేవే ఉండవని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మిగతా 80 శాతం మంది ప్రజలు ఎంతో ప్రశాంతంగా, చట్టానికి లోబడి తమ పనులు తాము చేసుకుంటూ బతుకుతుంటారు.

80/20 సూత్రం...

ఇటలీకి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త విల్ఫ్రెడో ప్యారేటో అనే ఆయన ఒక అద్భుతమైన నియమాన్ని కనుగొన్నారు. దీనినే అందరూ 80/20 సూత్రం అని పిలుస్తూ ఉంటాం. ఈ సిద్ధాంతం ప్రకారం సమాజంలో కేవలం 20 శాతం మంది ప్రజలు మాత్రమే ఏదైనా ఒక ప్రధానమైన మార్పుకు లేదా విషయానికి మూలకారణం అవుతుంటారు. ఉదాహరణకు మీ ఫోన్‌లోని 20 శాతం కాంటాక్ట్స్‌తోనే మీరు 80 శాతం సమయం మాట్లాడుతుంటారు. ఇదే సూత్రం మన దైనందిన జీవితంలోని అనేక అంశాలకు అద్భుతంగా సరిపోతుంది.

ప్రభుత్వ నిధులు మింగేసేది వీళ్లే

దేశంలో ఉన్న ప్రభుత్వ నిధులు, బెనిఫిట్స్ అన్నీ కూడా అందరికీ సమానంగా అందుతున్నాయా అంటే అదేమీ లేదు. దాదాపు 99 శాతం ప్రభుత్వ లబ్ధి కేవలం ప్రత్యేకమైన 20 శాతం మంది చేతుల్లోకే వెళ్తుంటోంది. మిగిలిన 80 శాతం మంది ప్రభుత్వం నుంచి లబ్ధి పొందడం లేదని అర్థమవుతుంది. దీనివల్ల ఆర్థిక అసమానతలు పెరగడమే కాకుండా నిజంగా సాయం అవసరమైన వాళ్ళకు కొన్నిసార్లు ఆ ఫలాలు అందకుండా పోతుంటాయి. ఈ పంపిణీ వ్యవస్థలో ఎక్కడో ఒకచోట లోపం ఉందనేది నిపుణులు నిత్యం చెబుతున్న ఒక పెద్ద నిజం.

ప్రమాదాల వేగం

రోడ్ల మీద జరిగే ప్రమాదాలు చూస్తే గుండె జారిపోతుంది. మన దేశంలో రోడ్డు ప్రమాదాలు లేదా ఇతర కారణాల వల్ల సంభవించే మొత్తం గాయాలు, ఆసుపత్రిపాలయ్యే కేసుల్లో దాదాపు 78 శాతం కేసులు ఆ 20 శాతం మంది నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయి. సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వంటి విపరీత ధోరణులే వీటికి ప్రధాన కారణం అవుతున్నాయి.

అనారోగ్య అలవాట్లు

మార్కెట్లో అమ్ముడవుతున్న కోట్ల రూపాయల సిగరెట్లలో దాదాపు 84 శాతం సిగరెట్లను కేవలం 20 శాతం మంది మనుషులే కాలుస్తున్నట్లు తేలింది. వీళ్ళు విపరీతమైన అలవాట్లకు బానిసలై రోజువారీగా విపరీతంగా పొగ తాగుతూ తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. అలాగే మార్కెట్లో ఉన్న మొత్తం క్రెడిట్ కార్డు బకాయిలు, అప్పుల్లో దాదాపు 83 శాతం అప్పు కేవలం ఆ 20 శాతం మంది పేరు మీదనే రికార్డు అవుతోంది. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి అవసరానికి మించి ఖర్చు చేయడం, చేతిలో డబ్బు లేకపోయినా ఈఎంఐల మీద కొనుగోళ్లు చేయడం వీరికి అలవాటుగా మారిపోతుంది.

జీవన శైలి

ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగంలో కూడా ఈ లెక్కలు అచ్చంగా సరిపోతాయి. ఈ కాలంలో పిజ్జాలు, బర్గర్లు, ఆయిల్ ఫ్రైడ్ ఐటమ్స్ లాంటి ఫాస్ట్ ఫుడ్స్‌ను ఎగబడి తినే వారిలో దాదాపు 67 శాతం మంది కేవలం అదే 20 శాతానికి చెందినవారు ఉంటున్నారు. వీళ్లకు ఇంట్లో చేసిన వంటల కంటే బయట దొరికే అనారోగ్యకరమైన నూనె పదార్థాలే ఎక్కువగా రుచిస్తుంటాయి. అలాగే మొత్తం మద్యంలో దాదాపు 53శాతం ఆల్కహాల్‌ను కేవలం ఆ 20శాతం మంది మాత్రమే తాగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. వీళ్ళు ప్రతిరోజూ లేదా తరచూ విపరీతంగా తాగి తమ కాలేయాన్ని పూర్తిగా పాడు చేసుకుంటూ తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

ఒక్కరు సరిపోరు...

అలాగే సమాజంలో ఉన్న మొత్తం సెక్స్ పార్టనర్స్ లేదా రిలేషన్షిప్స్‌లో దాదాపు 47 శాతం భాగస్వామ్యాలు ఆ 20 శాతం మంది చుట్టూనే తిరుగుతుంటాయి. చాలా మంది జీవితంలో ఒక్కరితోనే స్థిరపడిపోతే ఈ చిన్న వర్గం మాత్రం ఎక్కువ మంది భాగస్వాములతో గడపడానికి ఆసక్తి చూపుతుంటుంది. వారు ఎంజాయికి అలవాటు పడతారు.

గోమూత్రం... ఎంతమాత్రం

టీవీ చర్చల రగడ

- ల్యాబ్‌లలో దొరకని రుజువులు
- నమ్మకాలే ప్రధాన ఆధారం
- క్లినికల్ ట్రయల్స్ కరువు

టీవీ స్టూడియోల్లో గోమూత్రంపై జరుగుతున్న రగడ వెనుక శాస్త్రీయ ఆధారాలు ఎక్కడా కనిపించడం లేదు. సర్వరోగ నివారిణి అని కొందరు, అస్సలు నమ్మొద్దని మరికొందరు చేసే వాదనలతో సామాన్య ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఎలాంటి ల్యాబ్ ఎవిడెన్స్ లేకుండా కేవలం భావోద్వేగాల చుట్టూనే ఈ చర్చలు తిరుగుతున్నాయి. - సహనం వందే, హైదరాబాద్

మన దేశంలో ఆవును పవిత్రంగా భావించడం ఎప్పటి నుంచో వస్తున్న ఆచారం. దీనివల్ల గోవుకు సంబంధించిన ప్రతి వస్తువుపై ఒక నమ్మకం ఏర్పడింది. ఆవు మూత్రాన్ని ఆయుర్వేదంలో వివిధ రకాల ఔషధాల తయారీలో వాడతారని చాలామంది గట్టిగా నమ్ముతున్నారు. కానీ ఈ నమ్మకానికి ఆధునిక సైన్స్ అద్దం పడుతుందా లేదా అనేది అసలు ప్రశ్న. టీవీ ఛానెళ్లలో జరిగే చర్చలన్నీ కేవలం నమ్మకాలు భావోద్వేగాల చుట్టూనే తిరుగుతున్నాయి. ఏ శాస్త్రీయ సిద్ధాంతమైనా నిరూపితం కావాలంటే క్లినికల్ ట్రయల్స్ పాస్ కావాలి. మనుషులపై రియల్ టైమ్ ప్రయోగాలు చేసి దుష్ప్రభావాలు లేవని తేలితేనే దాన్ని మందుగా అంగీకరిస్తారు. కానీ గోమూత్రం విషయంలో అటువంటి పక్కా క్లినికల్ ట్రయల్స్ ఇప్పటివరకు రికార్డు కాలేదు.

కెమికల్ అనాలసిస్ లో లోపాలు

అసలు సమస్య ఎక్కడ వస్తుందంటే ఆవు మూత్రంలో ఏముందనే దానిపై స్పష్టమైన కెమికల్ అనాలసిస్ పూర్తిస్థాయిలో జరగలేదు. మూత్రంలో యూరియా, మినరల్స్, సాల్ట్స్ ఉంటాయి కాబట్టి వాటి ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని ఆయుర్వేద గ్రంథాల్లో దీన్ని శుద్ధి చేసే విధానాలు, వాడే పద్ధతులు స్పష్టంగా చెప్పారు. కానీ నేడు మార్కెట్లో దొరికే బాటిళ్లలో ఉన్న మూత్రం ఎంతవరకు సురక్షితం అనేదానిపై స్పష్టత లేదు. ఎలాంటి ప్రాసెసింగ్ లేకుండా నేరుగా వాడితే అది శరీరానికి మేలు చేయడం కంటే హాని చేసే అవకాశం కూడా ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రారంభ దశలోనే పరిశోధనలు

గత కొన్ని దశాబ్దాలుగా మన దేశంలోని కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పరిశోధనా సంస్థలు గోమూత్రంపై పలు రకాల అధ్యయనాలు చేశాయి. ఇందులో యాంటీ బయాటిక్ గుణాలు ఉన్నాయని, కొన్ని రకాల బ్యాక్టీరియాను ఇది అడ్డుకోగలదని కొన్ని పేపర్లు కూడా పబ్లిష్ అయ్యాయి. అయితే ఇవన్నీ కేవలం ప్రారంభ దశ ప్రయోగాలు మాత్రమే అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక ప్రయోగం ల్యాబ్ లోని కణాలపై పనిచేసినంత మాత్రాన అది నేరుగా మనుషులకు మందుగా పనిచేస్తుందని చెప్పలేము. ఈ చిన్న తేడాను టీవీ డిబేట్లలో ఎవరూ పెద్దగా పట్టించుకోకుండా కేవలం హైప్ క్రియేట్ చేయడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నారు.

ఆధునిక మందుల దారి వేరు

మనం నిత్య జీవితంలో వాడే ప్రతి ఆధునిక మందు వెనుక పదేళ్ల పరిశోధన, వేల మందిపై ప్రయోగాలు ఉంటాయి. పారాసెటమాల్ నుంచి క్యాన్సర్ డ్రగ్స్ వరకు ప్రతిదీ ల్యాబ్ పరీక్షల నుంచే బయటికి వస్తాయి. అలాంటప్పుడు కేవలం ఒక సాంప్రదాయ నమ్మకం ఆధారంగా దాన్ని అద్భుత ఔషధంగా ప్రకటించడం శాస్త్రీయంగా కరెక్ట్ కాదు. అలాగే దాన్ని పూర్తిగా పనికిరాని వ్యర్థంగా కొట్టిపారేయడం కూడా తొందరపాటే అవుతుంది. సైన్స్ ఎప్పుడూ రుజువుల ఆధారంగానే పనిచేస్తుంది కానీ డిబేట్లలో అరిచే అరుపుల ఆధారంగా కాదు. మన ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సోషల్ మీడియా ప్రచారాలను గుడ్డిగా నమ్మడం ఎంతమాత్రం మంచిది కాదు.

ఎయిర్ పోర్టుపై అన్నదాత ఫైట్

వెయ్యి రోజుల పోరాటంతో ప్రాజెక్టు నిలిపివేత

- మూడేళ్ల పోరాటంతో ప్రభుత్వాలకే చెమటలు
- రైతన్న ఉద్యమంతో ఎయిర్ పోర్ట్ రిజెక్ట్
- 20 వేల కోట్లతో పెట్టుబడిపై గట్టి పోరాటం
- ఏకనాపురం ప్రజల ధీరత్వం

చెన్నై నగరానికి రెండవ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ బలవంతపు నిర్ణయాన్ని ఎదిరించి ఏకనాపురం రైతులు అక్షరాలా 1100 రోజులు సాగించిన అద్భుతమైన ఉద్యమంతో వేల కోట్ల ప్రాజెక్టును నిలవరించారు. - సహనం వందే, కాంచీపురం

చెన్నై రద్దీని తగ్గించడానికి కాంచీపురం జిల్లాలోని ఏకనాపురం గ్రామంలో 20 వేల కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో కొత్త గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు ఏర్పాటు చేయాలని అధికారులు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. కానీ తమిళనాడులో ఢిల్లీ స్థాయి దిగ్గజాలకే చుక్కలు చూపిస్తూ ఏకనాపురం రైతులు మూడు సంవత్సరాలకు పైగా ఢిల్లీ స్థాయి దిగ్గజాలకే చుక్కలు చూపించారు. ఎన్నో ఉద్యమాలు కొద్దిరోజుల్లోనే నీరుగారిపోయినా ఈ గ్రామం మాత్రం మూడు సంవత్సరాలకు పైగా అద్భుతమైన ఉద్యమం సాగించింది.

36 నెలల నిరంతర యజ్ఞం

మిగతా చోట్ల లాగా కేవలం ఒక్కరోజు ధర్నాలు చేసి చేతులు దులుపుకోకుండా ఏకనాపురం ప్రజలు అక్షరాలా 1100 రోజులు అంటే దాదాపు మూడేళ్ల పాటు నిరంతర పోరాటాన్ని ఒక యజ్ఞంలా నడిపించారు. ప్రతిరోజూ ఉదయం లేస్తే నిరసన, రాత్రి పగలు తేడా లేకుండా గ్రామమంతా ఒకే తాటిపై నిలబడి సాగించిన ఈ సుదీర్ఘ పోరాటమే ప్రభుత్వాలను వణికించింది. రాజకీయ పార్టీలు, సంఘాలు వెనుక ఉండి నడిపిస్తేనే ఉద్యమాలు నడుస్తాయనే అప్రతిష్టను పూర్తిగా చెరిపేస్తూ ఆ గ్రామ ప్రజలే స్వయంగా తమ ఉద్యమానికి నాయకత్వం వహించారు.

మహిళలు పిల్లలతో గాంధేయ పోరు

ఈ పోరాటంలో మహిళలు, వృద్ధులు ముందుండి నడిచారు. పొలాలు పోతే తమ బతుకులు వీధిన పడతాయని భావించిన అక్కడి తల్లులు రోడ్డెక్కి వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జానపద పాటలు పాడుతూ ప్రదర్శనలు చేస్తూ నిరసనను నిత్యం చర్చనీయాంశంగా ఉంచారు. పిల్లలు సైతం స్కూళ్లకు సెలవులు పెట్టి మరీ తమ తల్లిదండ్రుల ఆవేదనకు గొంతుకలయ్యారు. ప్రతిరోజూ రిలే నిరాహార దీక్షలు చేయడం ప్రభుత్వ అధికారులను గ్రామంలోకి అడుగుపెట్టనీయకుండా బహిష్కరించడం వంటి వినూత్న పద్ధతులు అవలంబిస్తూ ఎక్కడా హింసకు తావు ఇవ్వకుండా కేవలం గాంధేయ మార్గంలోనే అధికారులకు చుక్కలు చూపించారు.

దిగివచ్చిన ప్రభుత్వం...

రోజులు గడిచేకొద్దీ ప్రజా వ్యతిరేకత తీవ్రరూపం దాల్చడంతో ప్రభుత్వాలు పూర్తిగా డిఫెన్స్ లో పడ్డాయి. ఏకనాపురం రైతుల గట్టి పట్టుదల ముందు భారీ బడ్జెట్ ప్రాజెక్ట్ సైతం మోకరిల్లింది. చివరకు ఏకనాపురం వద్ద విమానాశ్రయ నిర్మాణాన్ని నిలిపివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటన వెలువడింది. ఈ వార్త తెలియగానే ఆ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రైతులు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ తమ ఆనందాన్ని ఘనంగా పంచుకున్నారు.